# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పార్లమెంట్ ఉభయ సభలు సజావుగా సాగేందుకు ఈరోజు ప్రభుత్వం, ప్రతిపక్షాలు మధ్య ఏకాభిప్రాయం కుదిరింది.

- ❖ దేశంలో ఉడాన్ పథకం కింద 86 విమానాశ్రయాలను కలుపుతూ 609 మార్గాలను ప్రారంభించామని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

- ❖ భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు యువతను విద్య, నైపుణ్యంతో శక్తివంతం చేయాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

- ❖ రానున్న 10 సంవత్సరాల్లో 96 నౌకలు, జలాంతర్గాములను భారత నౌకాదళంలోకి చేర్చనున్నామని నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ ఉభయ సభలు సజావుగా సాగేందుకు ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో గందరగోళానికి ముగింపు పలకాలని ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. లోక్ సభ సభాపతి ఓం బిర్లా ఈ రోజు మధ్యాహ్నం పార్లమెంట్ హౌస్ లో వివిధ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశమయ్యారు. సభ సజావుగా సాగేందుకు అనుమతించాలని ఓంబిర్లా సభ్యులందరినీ కోరగా విపక్ష నాయకులు సానుకూలంగా స్పందించారు. అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు పార్లమెంటు వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాజ్యాంగంపై ఈ నెల 13, 14వ తేదీల్లో లోక్ సభలోనూ, 16, 17వ తేదీల్లో రాజ్యసభలో ప్రత్యేక చర్చ జరుగుతుందని తెలిపారు. పార్లమెంటు ఉభయ సభలు సజావుగా సాగేందుకు తమ మద్దతు ఉంటుందని సమావేశంలో పాల్గొన్న నాయకులు హామీ ఇచ్చారని కిరణ్ రిజిజు వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఉడాన్ పథకం ద్వారా ఇప్పటివరకు 86 విమానాశ్రయాలను కలుపుతూ 609 మార్గాలను ప్రారంభించామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాజ్యసభకు తెలిపారు. ఈ మేరకు మంత్రి ఈ రోజు రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వీటిలో 13 హెలిపోర్టులు, రెండు వాటర్ డ్రోమ్ లు ఉన్నాయని చెప్పారు. 21 గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలకు సూత్రప్రాయ ఆమోదం లభించగా, 12 విమానాశ్రయాలను ఏర్పాటు చేసి, కార్యకలాపాలు ప్రారంభించామన్నారు. నవీ ముంబై, విజయపుర, నోయిడా, హాసన్, ధోలేరా, భోగాపురం విమానాశ్రయాలు వచ్చే రెండు సంవత్సరాల్లో పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. విమానాశ్రయాలు ఆర్థిక కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారాయని, ఆర్థిక వ్యవస్థపై గుణాత్మక ప్రభావాన్ని చూపుతున్నాయని కేంద్రమంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు యువతను విద్య, నైపుణ్యంతో శక్తివంతం చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన 29వ భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు 2024లో మంత్రి ప్రసంగిస్తూ... సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ దృఢ సంకల్పాన్ని అందించే దేశంగా భారతదేశం ఎదుగుతోందని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల అంశంపై మంత్రి మాట్లాడుతూ... పర్యావరణానికి జరుగుతున్న నష్టానికి కారణం ప్రపంచ దక్షిణాది దేశాలు కాదని పియూష్ గోయల్ పేర్కొన్నారు.

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రయాగ్ రాజ్ లోని మహా కుంభమేళాను నూతన జిల్లాగా ప్రకటించింది. కొత్తగా ఏర్పడిన జిల్లాను మహా కుంభమేళాగా పిలుస్తారు. రాబోయే కుంభమేళా నిర్వహణను క్రమబద్ధీకరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే మహా కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌లో 2025 జనవరి 13న ప్రారంభమై ఫిబ్రవరి 26న ముగియనుంది. భారతీయ సంస్కృతిని పెంపొందించడంలో మహా కుంభమేళా ఒక మైలురాయిగా నిలుస్తుందని భావిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువస్తోందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. ఈ రోజు ఆయన ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... 2014లో 387 వైద్య కళాశాలు ఉండగా, దశాబ్ద కాలంలో అవి రెట్టింపై 780కి పెరిగాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమాపథకంగా అవతరించిందన్నారు. ఈ పథకం కింద 12 కోట్ల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఆరోగ్య బీమా అందుతోందని, 70 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి దీనిని వర్తింపజేస్తున్నామని మంత్రి తెలిపారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన సిబ్బంది, ఔషధాలపై పరిశోధనలు, ఔషధాల లభ్యత, మెరుగైన రోగనిర్ధారణ సౌకర్యాలతో ఆరోగ్య రంగంలో పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కోస్టల్ షిప్పింగ్ బిల్లు, 2024ను ఈ రోజు లోక్ సభలో కేంద్ర షిప్పింగ్ మంత్రి సర్బానాద సోనోవాల్ ప్రవేశపెట్టారు. తీరప్రాంత షిప్పింగ్ నియంత్రణకు సంబంధించిన చట్టాన్ని ఏకీకృతం చేయడానికి, సవరించడానికి, తీర ప్రాంత వాణిజ్యాన్ని, దేశీయ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందదుకు ఈ బిల్లు ను తీసుకువచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న 10 సంవత్సరాల్లో 96 నౌకలు, జలాంతర్గాములను భారత నౌకాదళంలోకి నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి తెలిపారు. అడ్మిరల్ త్రిపాఠి ఈ రోజు ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... ఒడిశాలోని పూరీలో ఈ నెల 4వ తేదీన నావికా దళ దినోత్సవం నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. 62 నౌకలు, ఒక జలాంతర్గామి నిర్మాణంలో ఉన్నాయని, వచ్చే సంవత్సరం వరకు ప్రతి నెలా ఒక నౌకను ప్రవేశపెట్టనున్నామని వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఫెంగల్ తుఫాను ప్రభావంతో తమిళనాడులో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. విల్లుపురం, తిరువణ్ణామలై, సేలం, ధర్మపురి, నమక్కల్, కృష్ణగిరి, తిరుపత్తూరు, నీలగిరి ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. తిరువణ్ణామలైలోని కొండ ప్రాంతాల్లో బండరాళ్లు ఇళ్లపై పడటంతో తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లింది. మూడు ఇళ్లు పూర్తిగా ధ్వంశమయ్యాయి. ఈ ఉదయం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు ప్రారంభించాయి. మరో 24 గంటల పాటు తీరం వెంబడి కొన్ని ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అండర్ -19 ఆసియా కప్ లో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లోని షార్జా క్రికెట్ స్టేడియంలో జపాన్ తో ఈ రోజు జరిగిన వన్డే మ్యాచ్ లో భారత్ 211 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలిత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 340 పరుగుల లక్ష్యాన్ని జపాన్ కు నిర్దేశించింది. లక్ష్య చేధనలో జపాన్ జట్టు 128 పరుగులు మాత్రమే చేసింది. మరోవైపు గ్రూప్-ఎ మ్యాచ్ లో పాకిస్థాన్ 69 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పై విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 79,743 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 80,248 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 24,276 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 11 పైసలు క్షీణించి 84.71 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 72.68 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు ధర 2,659 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత పది సంవత్సరాల్లో ఆయుష్ రంగం అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందని, ఆయుష్ రంగం మార్కెట్ 2023 నాటికి 4 వేల 300 కోట్ల డాలర్లను అధిగమించిందని కేంద్ర విద్యుత్, నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మలేషియాలోని బెంటాంగ్ క్యాంప్ లో భారత్ - మలేషియా హరిమౌ శక్తి 4వ సంయుక్త సైనిక విన్యాసాలు ఈ రోజు ప్రారంభమయ్యాయి. 78 మందితో కూడిన భారత బృందానికి మహర్ రెజిమెంట్ బెటాలియన్ ప్రాతినిధ్యంవహిస్తుండగా, రాయల్ మలేషియా రెజిమెంట్ కు చెందిన 123 మంది సిబ్బంది మలేషియా బృందానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను చేపట్టడానికి ఇరు దేశాల ఉమ్మడి సైనిక సామర్థ్యాన్ని

పెంపొందించడమే ఈ విన్యాసాల లక్ష్యమని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నెల 15వ తేదీ వరకు ఈ విన్యాసాలు కొనసాగానున్నాయి.

==========================
==========================